కౌన్సిల్‌లో రచ్చరచ్చ

- పోటాపోటీగా మేయర్ చాంబర్ ఎదుట కార్పొరేటర్ల బైఠాయింపు
- ఎజెండా చర్చించకుండానే ముగింపు
- శంభుని గుడి వద్ద ఆక్రమణలపై బీజేపీ.. వీధి వ్యాపారాలకు చర్చపై ఎంఐఎం పట్టు
- ప్రజా సమస్యలపై స్పందించని కౌన్సిల్ సభ్యులు
- ఈనెల 25న వీడ్కోలు సభ


మాట్లాడుతున్న మేయర్ నీతూకిరణ్

నిజామాబాద్ సిటీ: నగర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసాగా సాగింది. బీజేపీ, ఎంఐఎం సభ్యులు మేయర్ చాంబర్ ఎదుట బైఠాయించి నినాదాలు చేయడంతో గందరగోళం ఏర్పడింది. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మేయర్ దండు నీతూకిరణ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రత్యేక ఆహ్వానితునిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరయ్యారు. మొదటగా ఎంఐఎం కార్పొరేటర్లు జిల్లా కేంద్రంలోని పలు కూడళ్ల వద్ద తోపుడుబండ్లు, కూరగాయలు అమ్మేవారిని తొలగించవద్దని డిమాండ్ చేస్తూ పట్టుపట్టారు. ఈ అంశం చర్చించేందుకు ఎజెండాలో చేర్చాలని వారు పట్టుపట్టగా కొత్త అంశాలు చేర్చడానికి నిబంధనలు ఒప్పుకోవని మేయర్ నీతూకిరణ్, కమిషనర్ దిలీప్‌కుమార్ సూచించారు. దీంతో ఎంఐఎం కార్పొరేటర్లు మేయర్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గంటకు పైగా సభ ఆధీనంలోకి రాకపోవడంతో పది నిమిషాల పాటు సభను వాయిదా వేశారు. అదేవిధంగా బీజేపీ కార్పొరేటర్లు శంభునిగుడి, అహ్మదీబజార్, బోధన్ బస్టాండ్ తదితర ఏరియాల్లో రోడ్ల ఆక్రమణపై మండిపడ్డారు. వాటిని వెంటనే తొలగించాలని పట్టుపట్టారు. నగరంలో అక్రమ కట్టడాలు, తాత్కాలిక నిర్మాణాలకు బీజేపీ సహకరించదని బీజేపీ కార్పొరేటర్లు మేయర్ చాంబర్ ఎదుట నినాదాలు చేశారు. ఎజెండా అంశాలు చర్చించి తర్వాత వీటిపై మాట్లాడదామని మేయర్ సూచించినా ఎంఐఎం, బీజేపీ కార్పొరేటర్లు వినలేదు. ఒకే అంశం రెండు గంటల పాటు ఆందోళనకు దిగారు. వారు పట్టువిడవకపోవడంతో మేయర్ సభ ముగిసిందని ప్రకటించారు. దీంతో అధికారులు బయటకు వెళ్లిపోయారు.


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు


మేయర్ చాంబర్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంఐఎం కార్పొరేటర్లు

సమస్యలపై చర్చించకుండానే..

మున్సిపల్ కౌన్సిల్ చివరి సమావేశం సమస్యలపై చర్చించకుండానే ముగిసింది. నగరంలో ముఖ్యమైన సమస్యలున్నాయి. అభివృద్ధి పనులు, పన్నులకు సంబంధించి, మాస్టర్ ప్లాన్, యూజీడీ పనులు, అమృత్–2 పనులు, నగరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.60 కోట్ల నిధుల వినియోగం వంటి పలు అంశాలు చర్చకురాకుండానే మిగిలిపోయాయి. ఐదేళ్లపాటు కొనసాగిన కౌన్సిల్ చివరి సమావేశం రసాభాసాగా జరిగింది. ఈ ఐదేళ్లలో ఇలా చర్చలేకుండా సభ ఎప్పుడూ ముగించలేదు. సభలో చర్చిద్దామని ప్రణాళికలు వేసుకుని వచ్చినవారికి నిరాశే మిగిలింది.


సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల కార్పొరేటర్లు

కమిషనర్‌కు తొలి.. మేయర్‌కు చివరి సమావేశం

మున్సిపల్ కమిషనర్‌గా దిలీప్‌కుమార్ కొత్తగా వచ్చారు. ఆయనకు ఇదే మొదటి కౌన్సిల్ సమావేశం. నగర మేయర్ దండు నీతూకిరణ్‌కు చివరి సమావేశం. ఐదేళ్లలో ఇదే చివరి కౌన్సిల్‌సమావేశం. ఇప్పటివరకు కమిషనర్ జెడ్పీ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించారు. మేయర్ ఐదేళ్లకాలంలో అన్ని సమావేశాలు విజయవంతంగా నిర్వహించారు. అయితే ఈ సమావేశం ఇద్దరికి చేదు అనుభవాన్ని మిగిల్చింది.

39 అంశాలను చర్చిద్దామని..

నగర అభివృద్ధితోపాటు ముఖ్యమైన 39 అంశాలను చ ర్చిద్దామని ముందుగానే ఎజెండా పెట్టాం. కార్పొరేటర్లకు ముందుగానే సమాచారం ఇచ్చాం. హఠాత్తుగా కొత్త అంశం ఎజెండాలో చేర్చాలనడం సరికాదు. అది నిబంధనలకు విరుద్ధం. వారిని సముదాయించినా వినలేదు. దీంతో సభను ముగించక తప్పలేదు. – నీతూకిరణ్, మేయర్

మళ్లీ సమావేశం నిర్వహించాలి



మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మేయర్ సరిగా నిర్వహించలేదు. అక్రమ నిర్మాణాలకు బీజేపీ మద్దతు తెలపదు. ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ వారితో నింపారు. మేయర్ మళ్లీ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి.

– స్రవంతిరెడ్డి, బీజేపీ ఫ్లోర్‌లీడర్

నగర అభివృద్ధే కాంగ్రెస్ ఎజెండా



నగర అభివృద్ధి, ఇతర ముఖ్యమైన అంశాలపై చర్చించాల్సిన సమావేశం ఎలాంటి చర్చ లేకుండా ముగించడం అప్రజాస్వామికం. నగర అభివృద్ధి కాంగ్రెస్ ప్రధాన ఎజెండా. కార్పొరేటర్లను సమన్వయపర్చలేకపోవడం మేయర్ ఫెల్యూర్.

– గడుగు రోహిత్, కాంగ్రెస్ కార్పొరేటర్

స్ట్రీట్ వెండర్స్‌కు అండగా ఉంటాం



నగరంలో కొన్నేళ్లుగా పేదలు రోడ్లమీద తోపుడుబండ్లు, కూరగాయలు అమ్ముతూ జీవిస్తున్నారు. ఇప్పుడు హఠాత్తుగా రోడ్ల మీద అమ్మొద్దంటే వారి కుటుంబాలు ఏం కావాలి. ఎంఐఎం పార్టీ స్ట్రీట్ వెండర్స్‌కు మద్దతుగా ఉంటుంది.

– ఇద్రిస్ ఖాన్, డిప్యూటీ మేయర్

ఐదేళ్ల పాటు సజావుగా..



ఐదేళ్లపాటు జరిగిన కౌన్సిల్ సమావేశాలన్నీ సజావుగా సాగాయి. కానీ చివరి సమావేశం ఎలాంటి చర్చలేకుండా ముగియడం బాధగా ఉంది. ఇప్పటివరకు కౌన్సిల్ సమావేశాల్లో చర్చించి నగరాభివృద్ధికి సలహాలు, సూచనలు ఇచ్చాం.

– దారం సాయిలు, కో–ఆప్షన్ సభ్యులు

సభ్యులు సహకరించలేదు



అభివృద్ధి అంశాలు కౌన్సిల్‌లో చర్చకు వస్తాయని భావించాను. కానీ, ఎజెండాలో లేని అంశాలు చర్చించాలనడం నిబంధనలకు విరుద్ధం. సభ్యులను సమన్వయపర్చేందుకు ఫ్లోర్‌లీడర్లకు నచ్చచెప్పాను. కార్పొరేటర్లకు 25న వీడ్కోలు సమావేశం నిర్వహిస్తాం.

– ఎస్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘం(711) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బండారి భాస్కర్, పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

మండల టాపర్లకు నగదు పురస్కారం



సిరికొండ: గత విద్యా సంవత్సరంలో ఇంటర్, పదో తరగతిలో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నగదు పురస్కారాలను అందజేశారు. పాఠశాలలో శనివారం తహసీల్దార్ రవీందర్‌రావు, ఎంపీడీవో మనోహర్‌రెడ్డి పదో తరగతిలో ఆరుగురు టాపర్లకు, ఇంటర్‌లో ఒకరికి రావుట్ల చిన్న నర్సయ్య స్మారక నగదు పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ. ఐదు వేలతో పాటు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, స్కౌట్స్ గైడ్స్ ప్రతినిధి సాల్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుధాకర్ ఎన్నిక


సుధాకర్

నిజామాబాద్ సిటీ: కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ముష్క సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర నిర్మాణ జనరల్ బాడీ సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించారు. సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ముష్క సుధాకర్, రాష్ట్ర ఆఫీస్ బేరర్లుగా బి ఈశ్వరి, శశికళ, హేమలత, సభ్యులుగా సుమలత, సునీత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ... ప్రభుత్వం కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు.

సన్మానం



నిజామాబాద్ అర్బన్: నగరంలోని బాపూజీ వచనాలయ నూతన అధ్యక్షుడిగా నియామకమైన భక్తవత్సలంను శనివారం మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గైని గంగారాం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నీరడి లక్ష్మణ్, సక్కి విజయ్‌కుమార్, సక్కి ప్రభంజన్, బీరేందర్‌సింగ్, సంతోష్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

సభలను విజయవంతం చేయాలి



నిజామాబాద్ సిటీ: సీపీఎం పార్టీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. సంగారెడ్డిలో ఈనెల 25 నుంచి 28 వరకు సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభను పార్టీ సభ్యులు, సానుభూతిపరులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, విఘ్నేష్, ఆనంద్ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



సుభాష్‌నగర్: నగరంలోని వాగ్దేవీ డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో 10 మంది మహిళలకు నిజామాబాద్ ఆర్డీవో కె రాజేంద్రకుమార్ శనివారం కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. స్వయం ఉపాధి కోసం మహిళలు కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ శ్రీనివాస్, గౌరీ శంకర్, ప్రతినిధులు సూర్యప్రకాశ్, రాంప్రసాద్, చంద్రశేఖర్, రంజిత్ సింగ్, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: పేదలు, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సూచించారు. శనివారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా వైద్యాశాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని ఏడు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ, రోగులకు కావాల్సిన చికిత్సలు, మందులు అందించాలని సూచించారు. బస్తీ దవాఖానాల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది ఉన్నా రోగులను పట్టించుకోవడం లేదని, మందులు ఇవ్వకుండా రికార్డుల్లో మాత్రం లెక్కలు అధికంగా చూపడంపై ఆగ్రహించారు. ఇటీవల ఓ బస్తీ దవాఖానాను తనిఖీ చేసిన సమయంలో పలు అంశాల గురించి ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వోను ఆదేశించారు. కాగా ప్రైమరీ హెల్త్ సెంటర్లలో మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో అంజన, డీఎస్‌వో నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో చేరాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి: గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు చేరాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచించారు. శనివారం తన క్యాంప్ కార్యాలయంలో గురుకుల ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. 5 నుంచి 9వ తరగతి ప్రవేశాలకు ఆసక్తి, అర్హత గల విద్యార్థులు టీజీసెట్–2025కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 31లోగా సమర్పించాలని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23న ఉంటుందని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాధవీలత పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి కిషన్, అధ్యాపకులు ప్రేమలత పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వీడీసీ సభ్యులు

సిరికొండ: గడ్కోల్ గ్రామ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని శనివారం కలిశారు. గ్రామంలో నెలకొన్న సమస్యల గురించి వారు ఎమ్మెల్యేతో వివరించారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను వారు సన్మానించారు. భాస్కర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభు, శ్రీనివాస్, ప్రకాశ్ ఉన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి


డిచ్‌పల్లిలో ఇందిరమ్మ మోడల్ ఇంటికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి/ జక్రాన్‌పల్లి: పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో, జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ పూర్తిగా కనుమరుగు కానున్నదని, ఈ కార్ రేస్‌లో కేటీఆర్ త్వరలో జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. నాలుగేళ్లలో రూరల్ నియోజకవర్గంలో ఇళ్లు లేని నిరుపేదలకు 20వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. మొదటి విడతగా 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, గ్రామ సభలు పూర్తికాగానే అర్హుల జాబితా ప్రకటిస్తారని తెలిపారు. ఈ నెల 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం సాగు రైతులకు రైతు భరోసా, భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత (రేషన్) కార్డులు అందజేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాయడం వల్లే నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, శేఖర్ గౌడ్, పొలసాని శ్రీనివాస్, అమృతాపూర్ గంగాదర్, రామచందర్ గౌడ్, కంచెట్టి గంగాదర్, వాసుబాబు, ధర్మాగౌడ్, సాయిరెడ్డి, డాక్టర్ షాదుల్లా, రాజేశ్వర్, నరేశ్, దేవకరుణ, శ్రీనివాస్ గౌడ్, నిట్టుకిషన్ రావు, రమేశ్, జక్రాన్‌పల్లిలో చిన్నారెడ్డి, నర్సారెడ్డి, గంగారెడ్డి, శ్రీనివాస్, నాయకులు చిన్న సాయరెడ్డి, గోర్త రాజేందర్, బాల్‌కిషన్, విఠల్, పురుషోత్తం, మహేందర్, మద్దుల రమేశ్, శ్రీనివాస్‌గౌడ్, కనకరవి, కిరణ్మయి, సతీశ్‌కుమార్, దేవిక, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయాలి

మోపాల్: రైతాంగ సమస్యల పరిష్కారానికి ఎస్‌కేఎం ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించే ట్రాక్టర్ ర్యాలీకి రైతులు, వ్యవసాయ కూలీలు పెద్దసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 20న ఎంపీల నివాసాలు, కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని, 26న డివిజన్, జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, వాహనాల ర్యాలీలు ఉంటాయన్నారు. రైతులంతా ఏకమై ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అగ్గు ఎర్రన్న, అగ్గు చిన్నయ్య, బండమీది నర్సయ్య, బి గంగాధర్, రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఈఈ 327 వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంగాధర్


పూదరి గంగాధర్

సుభాష్‌నగర్: టీజీఎన్‌పీడీసీఎల్ కంపెనీ టీఎస్ఈఈ 327 యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్(వరంగల్ రీజియన్)గా పూదరి గంగాధర్ ఎన్నికయ్యారు. యూనియన్ ఎన్నికలు ఇటీవల వరంగల్‌లో నిర్వహించారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తానని పేర్కొన్నారు. ఆయనను అధికారు లు, యూనియన్ ప్రతినిధులు అభినందించారు.

రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలి



నిజామాబాద్ రూరల్: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జాతీయ నాయకుడు ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని మాధవనగర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘాల నాయకులతో చర్చించి ధర్నాను విరమించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉప్పలయ్య, ఈర్ల పైడి, రవీందర్,మారుతి,మల్లేశ్, నరసింహులు, సత్యనారాయణ,అనూషవ్వ,రజియా బేగం,గార బోయిన శంకర్,కనకయ్య,రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

డిచ్‌పల్లి: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన చాకలి చీకటి మల్లవ్వ గత నెల అనారోగ్యంతో మృతి చెందింది. రెండేళ్ల క్రితం ఆమె భర్త కూడా మృతి చెందడంతో బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మిక సంఘం సభ్యులు రూ.22,800 ఆర్థికసాయం అందజేశారు. జె మురళి, శ్రావణ్ కుమార్, రమేశ్, మల్లేశ్ యాదవ్, చిన్నలింబాద్రి, రూపేశ్, పర్సాద్, తులసిదాస్, అశోక్, భూమయ్య తదితరులు ఉన్నారు.

యోగ్యం కాని భూములను గుర్తించాలి


మైలారంలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్


ధర్పల్లిలో..

సిరికొండ/ ధర్పల్లి/ నిజామాబాద్‌రూరల్: గ్రామాల్లో సాగుకు యోగ్యం కాని భూములను, ఆబాది భూములను, వెంచర్లను గుర్తించాలని సిరికొండ తహసీల్దార్ రవీందర్‌రావు సూచించారు. మండలంలోని మైలారంలో సాగుకు యోగ్యం కాని భూముల గుర్తింపు సర్వేను శనివారం పరిశీలించారు. ఏఆర్ఐ నాగన్న, సర్వేయర్ స్వామి ఉన్నారు. ధర్పల్లి మండలంలోని ధర్పల్లి, దమ్మన్నపేట్ గ్రామాల్లో కొనసాగుతున్న రైతు భరోసాపై తహసీల్దార్ మాలతి, ఏవో వెంకటేశ్ సర్వే నిర్వహించారు. నగరంలోని పాల్దా గ్రామంలో రేషన్‌కార్డుల సర్వేను ఎంపీడీవో రామ్‌నారాయణ పరిశీలించారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇందల్వాయి: జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటుపై బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సవిత, చిన్ను, నాయిడి రాజన్న, మోహన్‌రెడ్డి, కేపీరెడ్డి, సక్కి శ్రీనివాస్, జగత్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	80,900	వెండి(కిలో)	95,000
22 క్యారెట్స్	74,650		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	10	గాజరుగడ్డ	40	60
బెండకాయ	35	70	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	50	90	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	15	30	కరివేపాకు	60	100
మెంతికూర	20	40	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	80
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.45,4.30,7.25, 10.20
స్క్రీన్-2	గేమ్‌ఛేంజర్ -1.10,7.35 10.35; డాకు మహారాజు(తెలుగు)-4.30
స్క్రీన్-3	డాకుమహారాజు(తెలుగు)-11.00, 7.35,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)- 10.10, 1.10, 4.10, 7.10, 10.10
స్క్రీన్-2	డాకు మహారాజు (తెలుగు)- 10.20, 1.25, 7.35, 10.40; ఎమర్జెన్సీ(హిందీ)-4.30
స్క్రీన్-3	గేమ్ ఛేంజర్(తెలుగు)- 12.00, 3.20, 6.40; ఎమర్జెన్సీ(హిందీ)-10.00
స్క్రీన్ -4	ఎమర్జెన్సీ(హిందీ)-12.00; ఆజాద్(హిందీ)-3.05, 10.15; పుష్ప-02(తెలుగు)-6.10

లలితామహల్	గేమ్ ఛేంజర్(తెలుగు)
దేవి	డాకు మహారాజు(తెలుగు)
నటరాజ్	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

నియమాలు పాటించాలి



సిరికొండ: రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై ఎల్ రామ్ సూచించారు. చీమన్‌పల్లిలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను శనివారం నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపద్దని పలువురు వాహనదారులకు సూచించారు. కాంగ్రెస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 6, 7, 8 తరగతులకు గెస్ట్ ఫ్యాకల్టీలో గణితం బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గడ్డం రాజేశ్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పాఠశాలలో దరఖాస్తు చేసుకుంటే, 21న పాఠశాలలో డెమో నిర్వహిస్తామని అన్నారు.